RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 150 | మే 08, 2025 | వెల : రూ.3-00



రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

4లో..



# వీ ఆల్ ఆర్ వన్

- మనమంతా ఒకే స్వరం వినిపిద్దాం
- 'ఆపరేషన్ సిందూర్'కు తెలంగాణ సీఎం మద్దతు
- మంత్రులు, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలి
- ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తే కఠిన చర్యలు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్:**

భారత సాయుధ బలగాలు కొనసాగిస్తున్న 'ఆపరేషన్ సింధూర్'కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేశాయని పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రతి పౌరుడు భారత సైనికులకు అండగా సంఘీభావంగా, ఐక్యంగా నిలబడాలని కోరారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశ రక్షణలో హైదరాబాద్ వ్యూహాత్మక కేంద్రంగా ఉండటంతో, తాజా పరిస్థితులపై, తీసుకోవాల్సిన అప్రమత్త చర్యలపై ఆయా విభాగాలకు దిశానిర్దేశం చేశారు. ఒక భారతీయ పౌరుడిగా, నేను ముందుగా మన సాయుధ దళాలకు బలంగా అండగా నిలుస్తున్నాను. ఉగ్రవాద నిర్మూలన కోసం భారత సైన్యం చేపట్టిన ఈ ధైర్యవంతమైన చర్య దేశ భద్రతకు నిదర్శనం. ఈ దాడులు మన సైన్యం

మిగతా 4వ పేజీలో..





# 'సిందూర్' సక్సెస్

- ఉగ్రదాడిపై భారత్ ప్రతీకారం
- 9 ఉగ్ర శిబిరాలపై దాడి

**వేద న్యూస్, డెస్క్:**

జమ్మూకశ్మీర్‌లోని పహెల్గాం ఉగ్రదాడిపై ప్రతీకారంతో రగిలిపోయిన భారత్ పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై గట్టిదెబ్బ వేసింది. అర్ధరాత్రి తర్వాత మెరుపుదాడి చేసి తొమ్మిది స్థావరాలను మట్టుబెట్టింది. తానేంటో నిరూపించుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరిట విరుచుకుపడింది. అయితే భారత్ మెరుపు దాడులకు 'ఆపరేషన్ సింధూర్' అనే పేరును ఎవరు పెట్టారని దానిపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్న వేళ అధికారిక వర్గాలు స్పందించాయి. 'ఆపరేషన్ సింధూర్' పేరును సూచించింది ప్రధాని మోదీ అని అధికారిక వర్గాలు చెప్పాయి. అంతకుముందుకు కూడా మోడీనే స్వయంగా పెట్టినట్లు కథనాలు వెలువడ్డాయి. మన మహిళలు భర్తలను కోల్పోయారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని భారత్ ఎక్కడున్నా వదిలిపెట్టదు అనేలా మన ప్రతిస్పందన కచ్చితంగా కనిపించాలి అని మోదీ అధికారులకు స్పష్టంగా చెప్పినట్లు సమాచారం.

విదేశాంగశాఖ, రక్షణశాఖ సంయుక్త మీడియా సమావేశం బుధవారం నిర్వహించింది. ఉగ్ర ఘటనలపై మీడియా సమావేశంలో వీడియో ప్రదర్శించింది. ఈ మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియాతో మాట్లాడారు. పక్కా ప్లానింగ్ తో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టాం అని వెల్లడించారు. సీమాంతర ఉగ్రవాదంపై పోరాటం భారత్ హక్కుగా పేర్కొన్నారు. కరుడుగట్టిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీకి ట్రైనింగ్ ఇచ్చిన శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. పహల్గాం ఘటనలో 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఉగ్ర మూకలకు పాకిస్థాన్ అండగా నిలుస్తోందన్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనక టీఆర్ఎఫ్ ఉందని టీఆర్ఎఫ్‌కు పాకిస్థాన్ అండదండలున్నాయని తెలిపారు. లష్కరే తొయిబా, జైషే మహ్మద్‌పై ఇప్పటికే నిషేధం ఉంది. ఉగ్ర సంస్థలపై నిషేధం దృష్ట్యా టీఆర్ఎఫ్ పేరుతో కార్యకలాపాలు చేపట్టారు. టీఆర్ఎఫ్ వెనక ఉన్నది లష్కరే తొయిబా, జైషే మహ్మద్ ఉగ్ర సంస్థలే. జమ్ముకశ్మీర్‌ను అతలాకుతలం చేయడమే లక్ష్యంగా పహల్గాం దాడి చేశారని స్పష్టం చేశారు. కొంతకాలంగా కశ్మీర్‌లో పర్యాటకం వృద్ధి చెందుతోంది. జమ్ముకశ్మీర్ అభివృద్ధిని అడ్డుకునేందుకే పహల్గాం దాడి. పహల్గాంలో అతి క్రూరంగా ఉగ్రదాడి జరిగింది. కుటుంబసభ్యుల కళ్ల ముందే కిరాతకంగా చంపారు. టీఆర్ఎఫ్ గురించి ఇప్పటికే ఐరాసకు







ఫిర్యాదు చేశామన్నారు. ప్రత్యక్ష సాక్షుల వివరాల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించే పాక్ చరిత్ర ప్రపంచానికి తెలిసిందే. ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఇప్పటికే అనేక చర్యలు చేపట్టామని వెల్లడించారు.

### 9 ప్రదేశాలను టార్గెట్ చేశాం

ఆపరేషన్ సింధూర్ జరిపిన తీరును కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వివరించారు. జమ్మూకశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడి మృతులకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సింధూర్ చేపట్టామని, గత 30ఏళ్లుగా పాకిస్థాన్ టెర్రరిస్టులను సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. ఆ దేశంతో పాటు పీఓకేలోనూ టెర్రరిస్ట్ క్యాంపు ఉన్నాయని, ఇంటెలిజెన్స్ సమాచారం సాయంతో మొత్తం 21 స్థావరాలను గుర్తించామని వెల్లడించారు. అందులో 9 ఉగ్ర శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నామని పేర్కొన్నారు. తాము కేవలం ఉగ్ర శిబిరాలపైనే దాడులు చేశామని, పాకిస్థాన్ పౌరులకు హాని చేయకుండా రీతిలో వీటిని నిర్వహించామని స్పష్టం చేశారు. ఆర్మీ శిబిరాలను లక్ష్యంగా చేసుకోలేదని తెలిపారు. మే6 అర్ధరాత్రి 1.05-1.30 గంటల మధ్య ఆపరేషన్ సిందూర్ జరిగిందన్నారు. భారత్ టార్గెట్ చేసిన వాటిల్లో లాహోర్‌కు 40కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలో గల లష్కరే తోయిబా కూడా ఉందని, ఇక్కడ 26/11 ముంబయి దాడులకు పాల్పలడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ ట్రైనింగ్ తీసుకున్నారని కర్నల్ సోఫియా ఖురేషి తెలిపారు.

# సాయుధ దళాలకు సెల్యూట్

- భారతీయులందరినీ గర్వపడేలా చేశాయి
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**వేద న్యూస్, డెస్క్:**



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్గదర్శకత్వంలో భారత సాయుధ దళాలు భారతీయులందరినీ గర్వపడేలా చేశాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. భారత సాయుధ దళాలు తమ శౌర్యం, ధైర్యాన్ని ప్రదర్శించి కొత్త చరిత్రను సృష్టించాయన్నారు. భారత సాయుధ దళాలు కచ్చితత్వం, అప్రమత్తతతో వ్యవహరించాయని నిర్దేశించిన లక్ష్యాలను సరైన సమయంలో కచ్చితత్వంతో నాశనం చేశాయని చెప్పారు. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు.

### హనుమంతుడే ఆదర్శం

ఆపరేషన్ సింధూర్‌కు లంకను దహనం చేసిన హనుమంతుడే తమకు ఆదర్శమని వెల్లడించారు. అశోక వనానికి వెళ్లేటప్పుడు హనుమంతుడు అనుసరించిన సూత్రాన్ని ఈ దాడిలో తాము అనుసరించినట్లు చెప్పారు. తమ అమాయక ప్రజలను చంపిన వారిని మాత్రమే తాము లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. తన గడ్డపై జరిగిన దాడికి ప్రతిస్పందించే హక్కు భారత్ కు ఉందని ఈసారి కూడా, మునుపటిలాగే తగిన సమాధానం భారత్ ఇచ్చినట్లు వివరించారు. పాకిస్థాన్ పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినందుకు భారత సైన్యాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్‌కు ఆర్మీకి పూర్తి స్వేచ్ఛనిచ్చిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. సరిహద్దుల్లో మౌలికవసతులు మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో అనేక దేశాల సంస్కృతులు కనిపిస్తాయని, భారత సంస్కృతి కూడా అనేక దేశాల్లో విస్తరించి ఉన్నదని చెప్పారు. వేల సంవత్సరాలుగా అనేక దేశాలతో మైత్రీభావంతో ఉన్నామని, భారత్‌కు వివిధ మార్గాల్లో అరబ్బులు, యూరోపియన్లు వచ్చారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా మౌలిక వసతులు పెంచేందుకు కట్టుబడి ఉన్నామని మరోసారి మంత్రి స్పష్టం చేశారు.




# వనరులను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్..!

- మావోలతో చర్చలు జరపాలి
- ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్య

**వేద న్యూస్, శాయంపేట:**

ఆదివాసీలను హత్య చేసి మధ్య భారతంలో ఉన్న కోట్లాది రూపాయల ఖనిజ సంపదను,సహజ వనరులను దోచుకోవడమే బిజెపి లక్ష్యమని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్య ఆరోపించారు.

మిగతా 4వ పేజీలో..



# ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లను వెంటనే అందజేయాలి

## కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే


**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్ లను వెంటనే అందజేయాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్ ద్వారా 30,500 దరఖాస్తులను ప్రాసెసింగ్ చేయడం ద్వారా బల్దియా కు సుమారు రూ.130 కోట్ల ఆదాయం సమకూరిందని, డబ్బులు చెల్లించిన దరఖాస్తు దారులకు క్రమబద్ధీకరణకు చెందిన ప్రొసీడింగ్ లను అందజేయాలని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగర వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి నోటీసులు అందజేయాలని సూచించగా, ఇప్పటివరకు 348 భవనాలకు నోటీసులు అందజేసినట్లు సిటీ ప్లానర్ తెలిపారు. బడా భవనాలలో ఉన్న సెల్లార్‌లలో ఏమైనా నిర్మాణాలు ఉంటే తొలగింపు, ఖాళీ చేయించాలని సెల్లార్‌లలో ఉండే ఎలక్ట్రికల్ డివైజ్‌లు మొదటి అంతస్తులో ఉండేలా చూడాలని, మోటార్ పంపు సెట్‌లను అందుబాటులో ఉంచాలని, టిజి బిపాస్‌లో బిల్డింగ్ పర్మిషన్‌లను నిర్దిష్ట గడువులోగా అనుమతిలు మంజూరు జరిగేలా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసిపిలు శ్రీనివాస్ రెడ్డి, రజిత, ఖలీల్, నస్రీన్ టిపిఎస్‌లు రోజారెడ్డి, సుమన,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వర్ధన్నపేట:**



భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకుని గ్రామాలను భూసమస్యలు లేని పల్లెలుగా తీర్చిదిద్దుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. భూ భారతి అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలన్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ అమలవుతున్న వర్ధన్న పేట మండలం కట్రియాల, ఇల్లంద గ్రామాల్లో నిర్వహించిన భూభారతి సదస్సుల్లో పాల్గొని రైతు లకు చట్టంపై అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేసి, భూ సమస్యలపై రైతులు చేసుకొన్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహిం చారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకున్నారు. భూ భారతిపై అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్ధన్నపేటను పైలట్ మండలంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డుల తప్పులు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గు లు, వారసత్వ భూములు, సర్వే నంబర్ల మిస్సింగ్, పట్టా పాస్ పుస్తకాలు లేక పోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్ -బీ కింద చేర్చిన భూ ముల తదితర దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించాలని

మిగతా 4వ పేజీలో..

# జోరందుకున్న కూలర్ల విక్రయాలు

**- సామాన్యులకు అందుబాటులో రకరకాల కూలర్స్**

**వేద న్యూస్, జమ్మికుంట:**



మే నెల ప్రారంభమైన నాటి నుంచి భానుడు భగభగల నుంచి ఉపశమనం కోసం జనం కూలర్లను కొనుగోలు చేసేందుకు షాపులకు పరుగు పెడుతున్నారు. తమ బడ్జెట్‌లో వచ్చే కూలర్లను కొనేందుకు ఆసక్తి చూపుతుండటంతో వ్యాపారులు కూడా వివిధ మోడళ్లలో అందుబాటులోకి తెచ్చారు. తీవ్రమైన వేడి, వడగాలులతో కూడిన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం ప్రజలు తప్పనిసరిగా కూలర్లను కొనుగోలు చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**- అందరికీ అనుగుణంగా కూలర్లు అవేలబుల్**

పేద, మధ్యతరగతి వారి ఇండ్లు, గదులకు అనుగుణంగా వివిధ సైజుల్లో కూలర్లు లభ్యమవుతున్నాయి. అయితే, కొందరు తమ పాత కూలర్లకు మరమ్మతులు చేయించుకుంటున్నారు. కాగా, మరికొందరు అయితే, పాతవాటితో కాలం వెల్లదీసే పరిస్థితులు లేవని భావిస్తూ.. సరికొత్త కూలర్లను కొనుగోలు చేస్తూ.. అలా వేసవికాలాన్ని "కూల్‌కూల్"గా కుటుంబ సభ్యులతో గడిపేందుకు తాప త్రయపడుతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం సైజును బట్టి రూ.3 వేల నుంచి రూ. 9వేల వరకు ధరల్లో కూలర్లు లభిస్తున్నాయి. కంపెనీల బ్రాండ్ ను బట్టి కొన్నింటి ధర ఇంకా ఎక్కువగా కూడా ఉంటోంది. ధర ఆధారంగా కూలర్లకు 1, 2 ఏళ్ల గ్యారంటీ, వారంటీ ఇస్తున్నామని నగరంలోని పలువురు కూలర్ల షాపు యజమానులు చెపుతున్నా రు. వేసవి ప్రారంభం నాటికి ఇప్పటికి కూలర్ల ధరలు భారీగా పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు. పలు ప్రముఖ కంపెనీలు కూడా బ్రాండెడ్ పేర్లతో కూలర్లను అందు బాటులోకి తేగా.. అసెంబుల్డ్ కూలర్లు కూడా బాగానే అమ్ముడవు తున్నాయి. ఇవి ప్లాస్టిక్, ఐరన్ బాడీలతో పలు పేర్లతో లభ్యమవుతున్నాయి.




**- సరసమైన ధరలకు అందరికీ అందుబాటులో కూలర్లు**

వేసవికాలం ప్రారంభం నుంచే ఎండలతో పాటు కూలర్ల అమ్మకాలకు గిరాకీ పెరిగింది. ఈ ఏడు పట్టణవాసులతో పాటు వివిధ గ్రామాల నుంచి కూలర్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సామాన్యుడికి అందుబాటు ధరల్లో కొత్త కొత్త మోడళ్లు.. అల్యూమినియం, ప్లాస్టిక్ బాడీలతో అందిస్తున్నాం. ఈ ఏడు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో గతం కన్నా ఇంకా ఎక్కువ కూలర్లను విక్రయించే చాన్స్ ఉంది. సామాన్యులకు అందుబాటులో ఉండేలా సరసమైన ధరలకే కూలర్లు అవేలబుల్‌గా ఉన్నాయి.

**-డి.రమణ, డీఆర్ ఎలక్ట్రికల్స్, కూలర్ల షాపు యజమాని**



## మంచానికే పరిమితమైన తల్లి..వెంటిలేటర్ పై తండ్రి

**- మానవతామూర్తులు ఆదుకోవాలని కుమారుడి వేడుకోలు**

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**

గత7 సంవత్సరాల కాలం నుండి తమ తల్లి, గాదె శ్రీదేవి పక్షవాతంతో మంచానికే పరిమితమైందని, ఇటీవల అనారోగ్యంతో, తమ తండ్రి శ్రీనివాసరావు, మూత్రపిండాలలో, రాళ్లు చేరి ఆ ప్రాంతం పూర్తిగా సెప్టిక్ లోనైందని కన్నీటి పర్యంతం అయ్యారు గాదె శ్రీనివాసరావు శ్రీదేవి కుమారుడు గాదే ప్రణవ్. బుధవారం సోషల్ మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తపరిచారు. తన తండ్రి శ్రీనివాస రావు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని ఈ నేపథ్యంలో గత ఏడు సంవత్సరాల క్రితం తమ తల్లి పక్షవాతానికి గురి అయి మంచానికే పరిమితం అయ్యిందని అన్నారు. రూ.10 లక్షల వరకు ఖర్చు చేసిన కాలు చెయ్యి ఆమె స్వాధీనంలోకి రాలేదని, కరువులో అధికమాసంలా తన తండ్రి శ్రీనివాస రావు హార్ట్ లో స్టంట్ వేయవలసిన పరిస్థితి ఏర్పడిందని ప్రస్తుతం తన తండ్రికి మూత్రపిండాలలో రాళ్లు చేరి గాల్ బ్లాడర్ లో సెప్టిక్ అయిందని, తమ తల్లిదండ్రుల చికిత్స నిమిత్తం ఇప్పటివరకు ఎనిమిది లక్షల రూపాయలు ఖర్చు అయిందని ఇంకా ఇద్దరు చికిత్స నిమిత్తం మరింత సొమ్ము అవసరం ఉందని ప్రణవ్ ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ ఉత్తీర్ణత పొందిన తాను అనేక చోట్ల అప్పులు చేసి, ప్రస్తుత నిరుద్యోగిగా ఉన్న తాను, పేద బ్రాహ్మణ సామాజిక కుటుంబానికి చెందిన వాడిని కావున తమ తల్లిదండ్రులపై ఔదార్యంతో వదాన్యులైన వారు, స్పందించి చిన్న మొత్తం నుండి మీ తాహత్తును బట్టి ఎంతైనా మా ఈ క్రింది నెంబర్లకు ఫోన్ పే లేదా గూగుల్ పే లో పంపితే తల్లిదండ్రులను బతికించుకునే ప్రయత్నం చేస్తానని మానవతామూర్తులు స్పందించాలని కోరారు. తన తండ్రి ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నారని కన్నీటి పర్యంతం అయ్యారు. మానవతామూర్తులు ఈ క్రింద చూపిన రెండు నెంబర్లలో మీ వదాన్యతను ప్రకటించి వారి ప్రాణాలకు భరోసా ఇస్తారని వినమ్రపూర్వకంగా చేతులు జోడించి మీడియా ముందు చెబుతున్నానని ప్రణవ్ అన్నారు. మీరు సహాయం చేయవలసిన నెంబర్లు 944160478 లేదా9705833191 అని తెలిపారు.

## ఇంట్లో చోరీకి యత్నం..!

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

ఓ ఇంట్లోకి చోరీకి ప్రయత్నించిన వ్యక్తి అలికిడికి నిద్రలేచిన యజమానికి మస్కాపొట్టి తప్పించుకున్నాడు. ఈ సంఘటన మీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం నాడు పోలీసులు తెలిపిన కథనం ప్రకారం బాలాపూర్ చౌరస్తాలోని త్రివేణి నగర్ కాలనీలో నివసించే శర్మ ఇంట్లో అర్ధరాత్రి దాటాక ఒక దుండగుడు చోరీకి చొరబడ్డాడు. ఇంటి కిటికీ అద్దాలు పగలగొట్టి కిటికీ తలుపులను గట్టిగా తొయ్యడంతో లోపల ఉన్న వాటర్ ఫిల్టర్ కింద పడి శబ్దం వచ్చింది. ఆ అలికిడికి యజమాని శర్మ నిద్రలేచి సీసీ కెమెరాను పుటేజీని పరిశీలించగా ఓ దుండగుడు కిటికీ పక్కనుంచి వెళుతున్నట్లు కనిపించింది. ఆయన తలుపు తెరిచేలోగా దుండగులు నేరుగా బయటకు వెళ్లి తిరిగి అదే వేగంతో యజమాని వద్దకు వచ్చి బయట నలుగురు వ్యక్తులు అనుమానంగా తిరుగుతున్నారని నమ్మించాడు. దాంతో ఆయన పదా చూద్దాం అంటూ బయటకు వచ్చాడు యజమానితో పాటు బయటకు వచ్చిన దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు.వెంటనే శర్మ డయల్ 100 కు కాల్ చేయగా పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.బాధితులు ఫిర్యాదు మేరకు మీర్ పేట సీఐ కీసర నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ నందు రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మిర్యాలగూడ సబ్-కలెక్టర్ నారాయణ అమిత్, ఎమ్మెల్యే బిఎల్ఆర్ లు మాట్లాడుతూ ఐకెపి సెంటర్ల నుండి మిల్లులకు వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని,రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని రైస్ మిల్లర్స్ ను ఆదేశించడం జరిగింది. ఈ సమావేశం లో డిసిఎస్ఓ వెంకటేష్,మిర్యాలగూడ తాహసిల్దార్ సంతోష్, కిరణ్ లతోపాటు మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి మాత అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్లే ఓవర్ వద్ద సుమారు 500 మంది పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి మాట్లాడుతూ వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో సమాజ సేవే లక్ష్యంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వాసవి మాత జన్మదిన పురస్కరించుకొని దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరీ బికుమల్ల కృష్ణ, ఆర్ సి తోనుకునూరి సంతోష్, జెడిసి బుద్ధ శ్రీనివాస్,డిస్టిక్ ఇన్చార్జి గో సేవ మిట్టపల్లి రమేష్, ఆర్ సి గుమ్మడవెల్లి శ్యాంసుందర్, యామ సంతోష్, శ్రీరంగం,రాము, గుడుగుంట్ల విద్యా సాగర్,వనితా క్లబ్ సెక్రటరీ పాలవరపు భవాని, వనమా అనురాధ, గుడుగుంట్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడొద్దు



**వేద న్యూస్, ఎల్బీనగర్ :**

రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నాగోల్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ గుడిసెలు మంగళవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి కొన్ని ఇండ్లు తగలబడ్డ విషయం తెలిసిందే. కాగా బుధవారం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అట్టి ప్రదేశంలో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున రావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించే బాధ్యత తనదేనని చెప్పారు.దానిలో భాగంగా అధికారులతో మాట్లాడిన సుధీర్ రెడ్డి బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని అధికారులకు తెలుపగా వారు తక్షణ సాయం క్రింద 8,000 రూపాయలు అందజేయడం జరుగుతుంది అని తెలిపారు.అలాగే ఇందిరమ్మ ఇండ్ల కోసం కొందరు దరఖాస్తు చేసుకోవడం జరిగిన నేపథ్యంలో మిగతా వారు కూడా దరఖాస్తు చేసుకోండి అని,వారికి కలెక్టర్ తో మాట్లాడి మీకు ఇండ్లు ఇప్పించేందుకు కృషి చేస్తా అని తెలిపారు.అలాగే మంటల్లో కాలిపోయిన పత్రాల గురించి ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.మళ్ళీ మరో పత్రాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.అలాగే పట్టాలు లేనివారికి కూడా పట్టాలు ఇప్పిస్తామని తెలిపారు.అనంతరం బాధితులకు అల్పాహారం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుజాత,డీ.ఈ.నీలిమ,నాగోల్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చిరంజీవి,సీనియర్ నాయకులు చెరుకు ప్రశాంత్ గౌడ్,సతీష్ యాదవ్,చందు,శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా చొరబడిన బంగ్లాదేశ్ రోహింగాలు.. పాకిస్తాన్ దేశస్తులను బహిష్కరించాలి

**వేద న్యూస్,కోదాడ/చిలుకూరు :**



సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు సూర్యాపేట జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు చెల్లా శ్రీలత రెడ్డి ఆదేశాల మేరకు అక్రమంగా వివిధ గ్రామీణ ప్రాంతాల్లో గాని మండలల్లోగాని నియోజక వర్గంలో చొరబడిన బంగ్లాదేశ్ రోహింగాలు పాకిస్తాన్ దేశస్తులు ఎవరైనా ఉంటే వారిని వెంటనే గుర్తించి వారిపై చర్యలు తీసుకొని వారి వారి దేశాలకు పంపించాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా పాకిస్తాన్ ఉగ్రవాద దాడిని ప్రతి ఒక్క భారతీయుడు ప్రజలు ప్రజాస్వామికవాదులు అందరూ ఖండించి మన దేశ రక్షణ దళానికి అండగా నిలవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పొరెల్లి మహేష్,సీనియర్ నాయకులు మునుగంటి నాగాచారి,వెంకన్న,మీసాల మట్టయ్య, బట్టు పంతు వీరస్వామి,తదితరులు పాల్గొన్నారు అని తెలిపారు.

## విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సంబరాలు

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తా వద్ద విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ బిజెపి ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ విజయంలో భాగంగా టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కాశ్మీర్ పహేల్గాం లో ముష్కరుల దాడి లో హిందు మహిళల సింధూరాన్ని లేకుండా చేసిన ఉగ్రాముక లా స్థావరాలపై ఆపరేషన్ సింధూరం పేరుతో చేసిన దాడి విజయవంతం కావడంతో భారత ప్రధానమంత్రి మోడీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ దాడి తో పాకిస్థాన్లో గల పలు ఉగ్రవాద సంస్థల స్థావరాలను ధ్వంసం చేసి భారత ఆర్మీ యుద్ధంలో వెన్నుచూపని ఆర్మీ. సైన్యానికి మద్దతుగా నూట నలభై కోట్ల జనాభా పూర్తి మద్దతును ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ బిజెపి సభ్యులు పాల్గొన్నారు.

## మున్నా యమహా షోరూమ్ ప్రారంభం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



ప్రజలకు అందుబాటు ధరలలో యమహా బైక్ లు అమ్మాలని,బెస్ట్ సర్వీసింగ్ ఇవ్వాలని ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి,ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్ అన్నారు.బుధవారం మిర్యాలగూడ సాగర్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన మున్నా యమహా షోరూమ్ ను అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులకు నచ్చిన విదంగా బైక్ లు అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా మహిళలకు కావలసిన వివిధ రంగులతో బైకులు ఆకర్షనీయంగా ఉన్నాయని వారన్నారు.కొత్త టెక్నాలజీతో వాహనాలు ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో యమహా షో రూమ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రమోద్, కాంగ్రెస్ నాయకులు ముజ్జ రామకృష్ణ,తెలంగాణ సేల్స్ హెడ్ సత్యనారాయణ,కమలాకర్, నల్గొండ ఏమహా మెయిన్ బ్రాంచ్ హెడ్ హేమందర్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్ నాయక్, యూత్ కాంగ్రెస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు రాజా రమేష్ యాదవ్, పిసిసి మాజీ సభ్యులు పగిడి రామలింగ యాదవ్,నూకల వేణుగోపాల్ రెడ్డి,గాయం ఉపేందర్ రెడ్డి,చిలుకూరి బాలు, చంద్రారెడ్డి,త్రిపురారం మండల మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు నజీమ్,దేశిడి శేఖర్ రెడ్డి, తలకొప్పుల సైదులు,ఎం ఏ సలీం,అరిఫ్,కుందూరు నరసింహారెడ్డి మైలారుశెట్టి సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం

**వేద న్యూస్, జమ్మికుంట:**




ప్రపంచ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని జమ్మికుంటలోని గాంధీ చౌరస్తాలో సీనియర్ క్రీడాకారులు బుధవారం కేక్ కటింగ్ చేసి ఘనంగా ప్రపంచ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జాతీయ హాకీ క్రీడాకారుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ హాజరయ్యారు. గత నాలుగు దశాబ్దాలుగా జమ్మికుంట, హుజరాబాద్ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులు రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ పోటీలలో పాల్గొని ఎన్నో పతకాలు సాధించిన ఘనత ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారికి ఎల్లవేళలా తమ సహాయ సాకారాలు అందిస్తామని వెల్లడించారు. క్రీడాకారులు బండ శ్రీనివాస్, రామ్ రాజా బాబు, అంబాల ప్రభాకర్ (ప్రభు) లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామ్ శ్రీనివాస్, డి కె స్వామి, కుమార్, ఎగిత అశోక్, గండికోట సమ్మయ్య, రామ్ శ్రీనివాస్, తిరుపతి శ్రీనివాస్, కొలుగూరి సురేష్ ,నరేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య దేవాలయ దర్వాజలు ఊరేగింపు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో శ్రీ శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య దేవాలయం రూపకర్త శ్రీ రామలింగేశ్వర మాజీ దేవాలయ చైర్మన్ ఎలగపల్లి లక్ష్మీ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. బుధవారం సాయంత్రం శ్రీ శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య దేవాలయ దర్వాజలు ఆమనగల్ గ్రామంలో ఊరేగింపు మహిళల కోలాట బృందాలతో, డిజె సౌండ్ లతో ఘనంగా నిర్వహించారు.అదేవిధంగా గురువారం ఉదయం శ్రీ తిరుపతమ్మ దేవాలయం దర్వాజలు ప్రతిష్టించడం కోసం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ రాబోతున్నారని శ్రీ రామలింగేశ్వర మాజీ చైర్మన్ ఎలగపల్లి లక్ష్మీ వెంకటేష్ పేర్కొన్నారు. కాగా ఆమనగల్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు, పాల్గొన్నారు.

# అక్రమ ధాన్యం రవాణాన్ని అడ్డుకున్న పోలీసులు

**వేద న్యూస్,దామరచర్ల :**



నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం దామరచర్ల మండల పరిధిలోని వాడపల్లి ఆంధ్రప్రదేశ్-తెలంగాణ అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి వరి ధాన్యంతో కూడిన ఏపీ 39టీ ఆర్ 1458 గల నెంబర్ లారీ వాహనం అక్రమంగా తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా జిల్లా పోలీసు శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో అడ్డుకోవడం జరిగింది. ఇందుకు సంబంధించిన సమాచారం అధికారులు జిల్లా ఎస్పీకి అందించగా వెంటనే స్పందించి ఉన్నతాధికారి ఆదేశాల మేరకు నిలిపివేయడం జరిగిందని,దానికి సంబంధించిన సమాచారంపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో పాటుగా స్థానిక మిర్యాలగూడ డీఎస్పీ కే.రాజశేఖర్ రాజు సంయుక్తంగా బుధవారం నాడు సంఘటన స్థలాన్ని సందర్శించి పలు రికార్డులను,అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎంఎస్పి ధరతో పాటుగా అదనంగా మరో 500 రూపాయలను బోనస్ గా చెల్లిస్తున్నందున సరిహద్దు ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు దళారులు అధిక ధరలకు తెలంగాణలో విక్రయించుకోవాలనే ఉద్దేశంతో అక్రమ పద్ధతిలో ఎటువంటి అనుమతులు లేకుండా ఈ మార్గం గుండా ప్రవేశించి తెలంగాణ రాష్ట్రంలో ఇతర పలు ప్రాంతాల్లో స్థానిక రైతుల పేరుతో వివిధ రైస్ మిల్లులకు విక్రయిస్తున్నారని తెలియజేశారు.గతంలో కూడా ఇదే మాదిరిగా అక్రమంగా వరి ధాన్యంతో ప్రవేశించిన మరో ఏడు లారీ వాహనాలను సీజ్ చేసి వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరిగిందని,ఇప్పుడు పట్టుబడి చేసిన వాహనంపై పూర్తి దర్యాప్తు చేసి చట్ట పరమైన తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అలాగే ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణలోకి ప్రవేశించే సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద ఆన్లైన్ సీసీ కెమెరాల ద్వారా నిత్యం జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ యంత్రాంగం క్షుణ్ణంగా పర్యవేక్షణ ఉంటుందని తెలియజేశారు.ఇతర రాష్ట్రాల నుండి అక్రమ వరి ధాన్యం రాష్ట్రంలోకి ప్రవేశించకుండా తీసుకున్న నిర్ణయానికి జిల్లా పోలీస్ యంత్రాంగం మరియు రెవెన్యూ శాఖ సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.వారి వెంట మిర్యాలగూడ రూరల్ సిఐ పి.ఎన్.డి ప్రసాద్,వాడపల్లి ఎస్ఐ ఎ.శ్రీకాంత్ రెడ్డి,పోలీస్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పత్తిపంటపై రైతు సమృద్ధి సదస్సు

- **'రాశిస్విఫ్ట్'తో అధిక దిగుబడి: ప్రదీప్ కుమార్**
- **హయ్యెస్ట్ ఇన్‌కమ్ పొందిన అన్నదాతలకు సన్మానం**
- **నూతన పత్తి రకం 'రాశిఅమేజ్' ఆవిష్కరణ**






**వేద న్యూస్, ఆసిఫాబాద్:**

రాశి సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వారు బుధవారం 'పత్తి పంటపై రైతు సమృద్ధి' సదస్సు ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించారు. ఆ కంపెనీ రీజినల్ మేనేజర్ ప్రదీప్ కుమార్, టీఎస్ఎం ఐలయ్య మాట్లాడుతూ.. పత్తి పంటలో వచ్చే చీడ, పీడలు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. కొత్త రకమైన రాశి స్విఫ్ట్ హైబ్రిడ్‌ను రైతుల సమక్షంలో ఆవిష్కరించారు. గతేడాది 'రాశి స్విఫ్ట్' పండించి అధిక దిగుబడులు పొందిన రైతులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం నూతన పత్తి రకం 'రాశిఅమేజ్'ను సైతం రైతుల సమక్షంలో రిలీజ్ చేశారు.

– ఎకరానికి 16 క్వింటాళ్ల తెల్ల బంగారం: రైతులు

అన్నదాతలు ఆకాశ్, వాడై శంకర్, చరణ్‌దాస్, రవిలు మాట్లాడుతూ.. 'రాశి స్విఫ్ట్' సీడ్ వల్ల తెల్లబంగారమైన పత్తి పంట తమకు తొందరగా చేతికొచ్చి.. రెండో పంట వేయడానికి అనుకూలమైందని చెప్పారు. ఎకరానికి 14 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, గుడ్డి పత్తి లేని పంట పొందామని వెల్లడించారు. ఈ సీడ్ రకం రసం పీల్చే పురుగులను తట్టుకుని, ఏరడానికి సులువుగా ఉందని, పెట్టుబడి ఖర్చు బాగా తగ్గిందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో 300 మంది రైతులు, 'రాశి' కంపెనీ సిబ్బంది బుచ్చయ్య, సాయికృష్ణ, ప్రవీణ్, సతీశ్, డిస్ట్రిబ్యూటర్స్ హసన్ ఫర్టిలైజర్స్ ఖలీద్, బాలాజీ ఫర్టిలైజర్స్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ముందడుగు వేయని 'స్టార్టప్'

**వేద న్యూస్, డెస్క్:**

భారతదేశంలో అధిక శాతం మంది స్వయం ఉపాధి రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఇది ప్రపంచంలోనే అత్యధికమని ఐఎస్ఒ నివేదించింది. ఒకరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి చూసుకోవాలి అని మన నేతలు నిత్యం చేసే ప్రచారాన్ని చూసి ఇది మంచిది అని అనుకోడానికి లేదు. ఎందుకంటే భారతదేశంలో ముఖ్యంగా స్వయం ఉపాధి రంగం దారుణంగా ఉంది. స్వయం ఉపాధి రంగం లో స్థిరపడాలనుకునే వారికి ప్రోత్సాహం ఉండదు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ వ్యవస్థలలో భారతదేశం అగ్రగామిగా ఉండేది. ప్రతి సంవత్సరం వేలాది కొత్త ఆలోచనలతో, వెంచర్లు, ప్రణాళికలు ఉద్భవిస్తున్నాయి. స్టార్టప్ ఇండియా వంటి ప్రభుత్వ చొరవతో ప్రోత్సహించబడిన సహాయక వాతావరణం ఉన్నప్పటికీ, అద్భుతమైన సంఖ్యలో స్టార్టప్‌లు ఒకటి రెండు సంవత్సరాలకు మించి మనుగడ సాగించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. దాదాపు 80% – 90% భారతీయ స్టార్టప్‌లు మొదటి ఐదు సంవత్సరాలలోపు మూసివేయబడుతున్నాయని. 8 శాతం మాత్రమే దశాబ్దం దాటి మనుగడ సాగిస్తున్నాయి అని పరిశ్రమ డేటా వెల్లడిస్తుంది. ఈ వైఫల్యాల మూల కారణాలపై ఇటీవల లోతైన పరిశోధన క్లిష్టమైన సర్వే, నిజ నిర్ధారణ కమిటీలు, నిర్లక్ష్యం చేయబడిన ప్రాథమికాలను వెల్లడిస్తుంది. ఉత్పత్తి మార్కెట్ ఫిట్ లేకపోవడం, అనేక స్టార్టప్‌లు తమ సమర్పణలను నిజమైన మార్కెట్ అవసరాలకు సమలేఖనం చేయడంలో విఫలమవుతాయి. వినూత్న ఆలోచనలు తరచుగా తమ సమయానికి చాలా ముందుండటం లేదా లక్ష్య జనాభాకు అసంబద్ధంగా ఉండటం ద్వారా మార్క్‌ను కోల్పోతాయి. పేలవమైన ఆర్థిక ప్రణాళిక, అసమర్థమైన నగదు ప్రవాహ నిర్వహణ, ప్రారంభ దశ ఆదాయ అంచనాలలో అతిగా చూపించడం, ఆశావాదం స్థిరమైన కార్యకలాపాలకు దారితీస్తాయి.అసమర్థ నాయకత్వం, కోర్ టీంలో సఖ్యత లేకపోవడం, ఆలోచనల్లో సారూప్యత లేకపోవడం, బృంద సంఘర్షణలు, వ్యవస్థాపకులు తరచుగా నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బందిపడుతున్నారు. స్టార్టప్ ప్రధాన భాగాన్ని బలహీనపరుస్తున్నారు. తగినంత నిధులు లేకపోవడం లేదా తప్పుదారి పట్టించడం, స్టార్టప్‌లు తగినంత మూలధనాన్ని సేకరించడం లేదా నిధులను దుర్వినియోగం చేయడం వలన అకాల స్కేలింగ్ లేదా కార్యాచరణ విచ్ఛిన్నం సంభవిస్తాయి. బలహీనమైన మార్కెటింగ్, కస్టమర్ సముపార్జన వ్యూహా లు, బలమైన బ్రాండింగ్, లక్షిత ప్రచారం లేకుండా అనేక స్టార్టప్‌లు పోటీ మార్కెట్లలో పట్టు సాధించడంలో విఫలమవుతాయి.నియంత్రణ, సమ్మతి సవాళ్లు, నిపుణుల మార్గదర్శకత్వం లేకుండా భారతదేశం సంక్లిష్టమైన చట్టపరమైన దృశ్యాన్ని నావిగేట్ చేయడం తరచుగా వైఫల్యాలకు దారితీస్తుంది.

సాంకేతికత ఉత్పత్తి, అభివృద్ధి సమస్యలు, సాంకేతిక నైపుణ్యం లేకపోవడం, పేలవమైన స్కేబిలిటీ తరచుగా ఉత్పత్తి విశ్వసనీయతను అలాగే వినియోగదారు సంతృప్తిని దెబ్బతీస్తాయి. సరికాని స్కేలింగ్ వ్యూహాలు, స్థిరమైన కార్యాచరణ పునాది లేకుండా చాలా వేగంగా లేదా చాలా నెమ్మదిగా స్కేలింగ్ చేయడం వల్ల అవకాశాలు లేదా ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుంది. కస్టమర్ ఫీడ్ బ్యాక్‌ను నిర్లక్ష్యం చేయడం, వినియోగదారు ఇన్‌పుట్‌ను విస్మరించడం, ఫీడ్ బ్యాక్ ఆధారంగా పునరావృతం చేయడంలో విఫలమవడం నిష్క్రమణ, గందరగోళానికి దారితీస్తుంది. తీవ్రమైన మార్కెట్ పోటీ, తమను తాము వేరు చేసుకోలేని స్టార్టప్‌లు బాగా నిధులు సమకూర్చుకున్న లేదా మరింత వినూత్నమైన పోటీదారులకు నష్టపోతాయి. పేలవమైన నియామకం, బృంద నిర్మాణం, బలహీనమైన టీం డైనమిక్స్, అస్పష్టమైన పాత్రలు తక్కువ ధైర్యం, అసమర్థతకు దారితీస్తాయి. మార్కెట్ సామర్థ్యాన్ని తప్పుగా అంచనా వేయడం, సమగ్ర పరిశోధన లేకుండా అతిగా సంతృప్త లేదా తక్కువ డిమాండ్ ఉన్న మార్కెట్లలోకి ప్రవేశించడం వల్ల పనితీరు తగ్గడం వలన నిష్క్రమణ జరుగుతుంది.భారతదేశం ఫ్లిప్‌కార్ట్, జొమాటో, పెటిఎం వంటి యునికార్న్‌ల విజయగాథలు ఉన్నప్పటికీ అధిక వైఫల్య రేటు వాస్తవిక ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన అమలు, నిరంతర మార్కెట్ తక్షణ అవసరాన్ని హైలైట్ చేస్తుంది. ఔత్సాహిక వ్యవస్థాపకులకు సందేశం స్పష్టంగా ఉంది. ఆవిష్కరణ మార్కెట్ వాస్తవాలపై ఆధారపడి ఉండాలి. బలమైన నాయకత్వం ద్వారా మద్దతు ఇవ్వాలి. అలాగే దృఢమైన ఆర్థిక కార్యాచరణ వ్యూహాలపై నిర్మించబడాలి. స్వభావ రీత్యా భారతీయులు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడనివారు, స్వార్థపరులు, దురాశపరులు. ఇలాంటి లక్షణాలు కొత్త వెంచర్‌కు అసురక్షిత వాతావరణాన్ని సృష్టిస్తాయి. వాస్తవానికి బ్యాంకులు, ప్రైవేట్ పెట్టుబడిదారుల నుంచి నిధులు పొందడం ఒక సమస్య.

ప్రభుత్వ మద్దతు కేవలం ప్రచారం తప్ప ఆచరణలో శూన్యం. కొత్త ఆలోచనలు ప్రోత్సహించడానికి ఎటువంటి వ్యవస్థ లేదు. భారతీయ ప్రజలు కొత్త ఉత్పత్తులను అంగీకరించరు. స్టార్టప్‌ల వైపు నుండి, ఇందులో పాల్గొన్న వ్యక్తులు వారు అందించే దానికంటే డబ్బుపై ఎక్కువ శ్రద్ధ వహిస్తారు. పని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉండదు. పని సంస్కృతి చెత్తగా ఉంటుంది, కంపెనీ పట్ల విధేయత లేదు. వ్యవస్థాపకుడు ఉద్యోగుల పట్ల, ఉద్యోగులు యజమాని పట్ల విధేయత చూపరు. క్లుప్తంగా చెప్పాలంటే, భారతదేశానికి మెదడు లేదు, శక్తి లేదు, పర్యావరణం లేదు లేదా కొత్త ఆలోచనలను పెంపొందించడానికి వాటిని లాభదాయక వ్యాపారాలుగా మార్చడానికి డబ్బు లేదు.

# మానవ (మత)మృగాలు

**– పహల్గామ్ దాడి మృతులకు అశ్రునివాళి**

**వేద న్యూస్, డెస్క్:**



ఓగూడు చెదిరింది – ప్రతిగుండెపగిలింది.తన బిడ్డల మృత్యుగోష చూసిన భరతమాత బావురుమంటూ విలపించింది. చల్లని మంచుకొండ పర్యాటకుల పాలిట మృత్యుకొండగా మారినరోజు మానవత్వం మంట కలసిన రోజు బైసరన్ లోయలోని పచ్చని పచ్చికలకు అమాయక పర్యాటకుల రక్తంతో రంగేసినట్టు చరిత్రలో ఓ చీకటి రోజు కాళ్లపారాణి అయినా ఆరని నవ వధూవరుల్లో ఉగ్రవాదులు వరుణ్ణి బలిగొన్న వైనం. ఓ తండ్రి తన పిల్లల కోసమైనా తనకు ప్రాణభిక్ష పెట్టాలని కాళ్ళు పట్టుకుని వేడుకున్నా కనికరంలేని కరడుగట్టిన కసాయిగాళ్ళు కురిపించారు. గుళ్ళవర్షం ఆ తండ్రిపైన, తన ఆలనా పాలనా చూసే తండ్రి తన కళ్ళముందే రక్తపు మడుగులో విగతజీవిగా చూసిన ఆచిన్నారి వెక్కి వెక్కి గుక్క పెట్టి ఏడుస్తున్నది. ఎక్కడినుంచి వచ్చేనో ఈ నరరూప రాక్షసులు, పులి తన ప్రసవ సమయంలో ఆకలితో తన బిడ్డలను తానే తింటుంది అందుకే దానిని జంతువు అన్నాము. కులాల మతాల పేరిట మానవుడే మానవజాతిని సంహరించే మతోన్మాద మానవ మృగంలా మారబోతున్నాడా? అంటే మనిషి మళ్ళీ జంతువుగా మారబోతున్నాడా? ఇలాంటి క్రూరజంతు నైజం కల్గిన మానవమృగాలకు సమాజంలో జీవించే హక్కు లేదు. మతం మత్తులో మనిషి మరోమనిషిని చంపే హక్కు ఏ రాజ్యాంగంలో ఎవరికీ కల్పించింది? ఏ మత గ్రంథంలోనూ లిఖించబడలేదు. ఎంతోమంది భార్య పిల్లల శోఖాలే ఉగ్రవాదుల పాలిట శాపాలై పిరంగిగుండ్ల రూపంలో వారిని పెకిలిస్తాయి. ఇలాంటి నరరూప రాక్షసుల ఉగ్ర మూలలను ఆదిలోనే అంతమొందిస్తే ఇలాంటి మానవ మృగాలు పుట్టుకురావు. ఏ మనిషి అయినా మానవ మృగంలా మారినప్పుడు ఆ మనిషి ఏ కులం? ఏ మతం? అనేది చూడకుండా ఆ మృగాలకు మరణదండన విధించడం ద్వారా ప్రాణాలు కోల్పోయిన ఎంతోమంది అమాయక జీవులకు న్యాయం చేసినవారం అవుతాము.

## ఫొటోలు, వీడియోలు షేర్ చేయమని కోరిన ఎన్ఐఏ

**వేద న్యూస్, డెస్క్:**

పహల్గాం ఉగ్రదాడిపై దర్యాప్తు చేస్తున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఇందుకు సంబంధించి ప్రజల వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా తమతో పంచుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఏప్రిల్ 22న పహల్గాంలో 26 మంది పర్యాటకులను అత్యంత పాశవికంగా ఉగ్రవాదులు కాల్చిచంపడంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ ఉగ్రదాడిలో పాక్ ప్రేమయం ఉందని కేంద్రం పలు సాక్ష్యాలు సేకరించడంతో పాటు పాక్‌పై కఠిన ఆంక్షలు విధించింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్, పీఓకేలోని 9 ఉగ్రవాద శిబిరాలపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మెరుపుదాడి చేసి సుమారు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఉగ్రవాదులను గుర్తించడం, వారు అనుసరిస్తున్న పద్ధతులు తెలుసుకోవడంలో ప్రజలిచ్చే సమాచారం మరింత కీలకమవుతుందని ఎన్ఐఏ బుధవారంనాడు ఒక ప్రకటనలో పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు, ఇంకేదైనా సమాచారం ఉంటే వాటిని స్థానికులు, టూరిస్టులు, విజిటర్లు తమతో షేర్ చేసుకోవాలని కోరింది. ఏజెన్సీ కాంటాక్ట్ నెంబర్లు... 9654958816ను కానీ ల్యాండ్ లైన్ నెంబర్ 011-24368800ను కానీ సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది. కాలర్ల సమాచారాన్ని సీనియర్ ఎన్ఐఏ అధికారి తీసుకుంటారని, కాలర్ల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతారని తెలిపింది.

వేద న్యూస్

గురువారం మే 08, 2025



## సీఎంఆర్ఎఫ్ అందజేసిన మధుయాష్కీ గౌడ్

**వేద న్యూస్, ఎల్బీనగర్ :**

రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ పరిధిలోని వెన్నుముక సమస్యతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చేరిన వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసిని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అందజేశారు. నాగోల్ డివిజన్ ఫతుల్లా కూడా చెందిన దుర్గం బుచ్చయ్య వెన్నుముక సమస్యతో బాధపడుతున్నాడు. శస్త్ర చికిత్సకు భారీగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో నాగోల్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు పెద్దలు సహకారంతో మధుయాష్కి గౌడ్ ని సంప్రదించారు. స్పందించిన ఆయన రూ. 2,50,000ల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసిని మంజూరు చేయించారు. ఈ మేరకు ఎల్ఓసి పత్రాన్ని బుచ్చయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, చెరుకు చిరంజీవి, బద్రుప్రసాద్ నాయక్ తదితరు యువ నాయకులు పెద్దలు పాల్గొన్నారు అని తెలిపారు.

## ప్రారంభమైన డిగ్రీ కళాశాల అడ్మిషన్లు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రొఫెసర్ సిహెచ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో బిఏ (ఇంగ్లీష్ తెలుగు మీడియం) బీకాం (కంప్యూటర్స్ అప్లికేషన్స్) బీఎస్సీ (లైఫ్ సైన్స్) బీఎస్సీ (ఫిజికల్ సైన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆన్లైన్లో దోస్త్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ 9866458512 దోస్త్ కోఆర్డినేటర్ వైస్ ప్రిన్సిపల్ 9440697746,9676709474 కాల్ అని చెప్పారు 200 రూపాయల అడ్మిషన్ రుసుము ఉంటుందని వెల్లడించారు. సమగ్ర అభివృద్ధికి మార్గదర్శక బడంగ్ పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందుకు సాగుతుందని అన్నారు. కళాశాల దోస్త్ కోడ్ 12818 ఆన్లైన్లో దరఖాస్తులు కళాశాలలో అనుభవజ్ఞుడైన డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయులు బోధన కొనసాగిస్తున్నారని కావున తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

**వేద న్యూస్, మోతే :**

మే డే స్ఫూర్తితో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బురకచర్ల గ్రామంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వారోత్సవాలలో భాగంగా బురకచర్ల గ్రామంలో మే డే సందర్భంగా సిపిఎం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో కి వచ్చిన బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో ప్రజలకు ఎలాంటి ఉపయోగం చేసే పని ఒక్కటి చేయలేదన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విమర్శించారు. అనేక సంవత్సరాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మొత్తం నిర్వీర్యం చేస్తూ కార్మికులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడుతుందన్నారు. రైతాంగానికి కార్మికులకు వ్యవసాయ కార్మికులకు నష్టం కలిగించే చర్యలకు బిజెపి ప్రభుత్వం పాల్పడుతూ వారి హక్కులను కాలరాస్తుందన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రోజురోజుకు బడ్జెట్ తగ్గిస్తుందన్నారు. ఉపాధి హామీ కూలీలు ప్రతిరోజు రెండు పూటలా హాజరు వేయాలని నిబంధన పెట్టడం సరికాదన్నారు. ఉపాధి కూలీలను ఆదుకునేందుకు ప్రతికూలికి 200 రోజులు పని కల్పించి రోజు కూలి 600 ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులు కార్మికులు వ్యవసాయ కార్మికుల వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం మొత్తం పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కక్కిరేణి సత్యనారాయణ, రెడ్డి మల్ల ఇందిర, సిపిఎం సీనియర్ నాయకులు కొండా రాములు, సిపిఎం గ్రామ కార్యదర్శి కొండ భాస్కర్, డివైఎఫ్ఐ మండల నాయకులు చెరుకు శ్రీను, సిపిఎం సీనియర్ నాయకులు అచ్చాలు, పల్ల మరియమ్మ, సామ్రాజ్యం, ఇందిరా, రామ్మూర్తి పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనుల్లో సౌకర్యాలు కరువు

- **నీడ, నీళ్లు లేక కూలీల ఇబ్బందులు..**
- **చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు..!**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



జిల్లాలో ఉపాధి హామీ పనులు జాబ్ కార్డ్ ఉన్న కూలీలు మండుటెండల్లోనే పనులు చేపడుతున్నారు. ఉపాధి హామీ కూలీలకు పని జరిగే ప్రదేశంలో సౌకర్యాలు పూర్తిగా గాలికి వదిలేశారు. జిల్లాలో ఉపాధి హామీ కూలీల నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పని ప్రదేశంలో నీడ, దాహం తీర్చుకునేందుకు నీళ్లు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూలీలకు గాయాలైతే చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్‌కిట్లు కూడా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో పంటల సీజన్ పూర్తయిన తర్వాత రైతులు ఎక్కువగా ఉపాధి హామీ పనులు వైపు దృష్టి మళ్లిస్తున్నారు. గ్రామాల వారీగా పని కల్పిస్తున్న అధికారులు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించపోవడంపై సంబంధించిన అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఉదయం 8 గంటల నుంచి ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పనులు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో పనులు చేయడానికి హాజరవుతున్న కూలీలు మండు టెండలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 7,65,172 జాబ్ కార్డులకుగానూ 15,98,147 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం 1,39,251 మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న ఎండ తీవ్రత కారణంగా ఉపాధి హామీ పనులకు రావాల్సిన కూలీలు ఇతర పనులకు వెళ్తున్నారు. ఎండ తీవ్రతలో కష్టపడి పని చేసినా కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని చాలా మంది వేరే ఇతర పనులకు మొగ్గు చూపుతున్నారు. పని ప్రదేశంలో టెంటు, నీళ్లు తట్ట, గడ్డపార వంటివి ఉపాధి హామీ నియమనిబంధనలో ఉన్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు లేకపోలేదు. అయితే జిల్లాలో పనికి వెళ్లే కూలీలు ముందస్తుగా నీళ్ల బాటిల్, టవల్, తట్ట, గడ్డపార తీసుకుపోతున్నారు. కొంతమంది వృద్ధులు ఊరికి దూరంగా పనులు ఉండడంతో కాలినడకన పని ప్రదేశానికి ఎండలో బయలుదేరుతూ మోసుకొని పోతూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు పని ప్రదేశంలో సకల సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

# పాకిస్తాన్ జాతీయులు వెంటనే భారతదేశం విడిచిపోవాలి!

**వేద న్యూస్, రామగుండం,ఎన్టీపీసీ:**



పాకిస్తాన్ పౌరులు భారతదేశాన్ని వెంటనే విడిచి వెళ్ళాలని, అక్రమంగా నివసిస్తున్న వారిపై కాటన్ సెర్చ్ నిర్వహించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. అంతర్గం తహసీల్దార్ తూము రవీందర్ పటేల్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. బీజేపీ అంతర్గం మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్ మాట్లాడుతూ, పాక్ అనుకూల ప్రకటనలు చేస్తున్నవారిపై ఎవరైనా అయినా సరే వారి పై దేశద్రోహం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గత నెల కాశ్మీర్‌లోని పాహల్గామ్ ప్రాంతంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు హిందువులపై జరిపిన దాడి నేపథ్యంలో, భద్రతా కారణాల వల్ల కేంద్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్ 27నుంచి పాక్ పౌరులకు అన్ని రకాల వీసాలను రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో, వీసా గడువు ముగిసిన పాక్ జాతీయులు దేశాన్ని తక్షణం మే విడిచిపోవాలని తెలిపారు. తెలంగాణలో, ముఖ్యంగా రామగుండం పరిధిలో ఎవరైనా పాకిస్తాన్ పౌరులు అక్రమంగా నివసిస్తున్నట్టు తేలితే, వారిపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు, పోలీసులు కలిసి చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు కోరారు. అనుమా నాస్పదంగా కనిపించే ప్రతి ఇంటిని తనిఖీ చేయాలని, దేశంలో ఉంటూ పాకిస్తాన్ జిందాబాద్ అంటూ మాట్లాడే వారిని తక్షణం దేశం విడిచిపోవాలంటూ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బోడకుంట సుభాష్‌తో పాటు భూషిపాక సంతోష్, కొల్లూరి లక్ష్మణ్, అలకుంట మల్లేష్, మాడ అనిల్ రెడ్డి, పాల్ ఆకుల హరీష్, మీడివెల్లి అంజి, బొంతు రఘు, గోల్లూరి పురుషోత్తం, తోటది శ్రీనివాస్, మాడ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు సమీపంలో విశ్వబ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో ప్రతిష్టింపబడిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద 332వ ఆరాధన మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారని వీరబ్రహ్మేంద్రస్వామి కమిటీ చైర్మన్, భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి తెలిపారు. బుధవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణతొలి మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ మధుసూదనా చారి, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, స్వామి వారి దర్శనం తో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదం పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత నరేందర్ చారి, రాగి ఫణి, అశోక్ చారి, రాపల్లి కృష్ణమాచారి, ఫిరంగి స్వర్ణ చారి, ఈశ్వరోజు వేణు చారి, వల్లోజు బ్రహ్మచారి, దయానంద చారి, దంతోజు ప్రభాకరాచారి, చంద్రశేఖర్ చారి, శివకుమార్ చారి, భాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారని తెలిపారు.



# వీ ఆల్ ఆర్ వన్

**మొదటి పేజీ తరువాయి**

సామర్థ్యం, ధైర్యాన్ని ప్రపంచానికి స్పష్టంగా చాటాయి. మనమంతా ఒకే గొంతుకై, ఒకే స్వరం వినిపిద్దాం - జై హింద్.. అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### అనుమానాస్పద విషయాలు కనిపిస్తే సమాచారమివ్వండి

తాజా పరిణామాల నేపథ్యంలో ప్రజలేవరూ భయభ్రాంతులకు గురికాకుండా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద విషయాలు కనిపిస్తే వెంటనే పోలీసు విభాగానికి సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర సర్వీస్లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ సైన్యంతో మనమంతా ఉన్నామనే సందేశం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమయంలో రాజకీయాలు, పార్టీలకు తావులేదని స్పష్టంగా చెప్పారు. ఉద్యోగులు అంతా అందుబాటులో ఉండాలని, మంత్రులు, అధికారులు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి వచ్చి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. కమాండ్ కంట్రోల్ సెంటర్లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు ఇచ్చారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర మెడిసిన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో బెడ్ల అందుబాటుపైనా ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలన్నారు. రెడ్ క్రాస్ తో సమన్వయం చేసుకోవాలని, ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని వెల్లడించారు.

### 'ఫేక్' న్యూస్ ప్రచారంపై ఉక్కుపాదం

సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని, ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందన్నారు. ఫేక్ న్యూస్ ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలని వివరించారు. హైదరాబాద్ లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఐటీ సంస్థల దగ్గర భద్రతను పెంచాలని, హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు.

## వనరులను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్..!

**మొదటి పేజీ తరువాయి**

శాయంపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ కొమురయ్య మాట్లాడుతూ సహజ వనరులను కార్పొరేట్లకు దారదత్తం చేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులుగా ముద్రవేసి అమాయక గిరిజనులను చంపుతుందని మండిపడ్డారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారని వారితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరిపి ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని కర్రెగుటలలో మోహరించిన కేంద్ర ప్రభుత్వ బలగాలను వెనక్కి రప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ప్రజాస్వామ్యంలో చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు అరికెళ్ల దేవయ్య, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా నాయకుడు చింతల భాస్కర్, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా నాయకుడు మిర్యాల కుమార్, ప్రజాసంఘాల నాయకులు ధైనంపెల్లి సమ్మయ్య, ఊదాటి శ్రీను, కూకాటి నాగేశ్వరరావు, వంగరి సాంబయ్య పాల్గొన్నారు.

## భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి

**మొదటి పేజీ తరువాయి**

రెవెన్యూ అధికారులకు సూచించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్‌ను పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్లో గల ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా టార్పాలిన్ అందుబాటులో ఉంచుకొని ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవలసిందిగా సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రావాణా జరిగేలా చూడాలని మిల్లర్లకు సూచించారు. డిఆర్ఓ విజయలక్ష్మి, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, తహసీల్దార్ విజయసాగర్, ఆర్డీఓ కార్యాలయ ఏవో రమేష్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- **గ్రామ గ్రామాన రైతులకు అవగాహన కార్యక్రమం**

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేతలు డా. దిలీప్ కుమార్, డా. విశ్వాతేజ్, మండల వ్యవసాయ అధికారి గంగ జమున వారి ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" రైతుల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చులను తగ్గించుట, అవసరం మేరకు రసాయ నాలు వినియోగం, రైతు సోదరులు కొనుగోలు చేసిన విత్తనాల, పురుగుల మందుల రసీదులను భద్రపరచుకోవడం, పంట మార్పిడి వలన కలిగే ప్రయోజనాలు, చెట్లను పెంచడం, సాగునీటిని ఆదా చేయడం వలన కలిగే ప్రయోజనాలు రైతులకు ఈ అవగాహన కార్యక్రమంలో వివరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగశ్రీ, వ్యవసాయ కళాశాల వరంగల్ విద్యార్థులు, కొత్తగట్టు సింగారం గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073